

ప్రణాళికాబద్ధంగా..



- ఖరీఫ్‌కు సిద్ధమైన వ్యవసాయ యంత్రాంగం
- విత్తనాలు, ఎరువులపై ఎంతమేర అవసరమనే దానిపై అంచనాలు
- గతేడాది కంటే మరో 40వేల హెక్టార్లలో సాగుకు కృషి
- మొత్తంగా 8,766 క్వింటాళ్లు సబ్సిడీ విత్తనాలు
- అందుబాటులో 79,841 మెట్రిక్ టన్నుల ఎరువులు
- గిరిజన ప్రాంత రైతులకు 90శాతం రాయితీ

ముందస్తు వర్షాలతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. జిల్లా వ్యవసాయ యంత్రాంగం సైతం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఎంత మేర ఎరువులు, విత్తనాలు అవసరమో అంచనాలు వేస్తోంది. గత ఖరీఫ్ సీజన్‌లో 2.6లక్షల హెక్టార్ల లక్ష్యంతో ముందుకెళ్లి 100శాతం ఫలితాన్ని సాధించింది. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉండడంతో మరో 40వేల హెక్టార్లలో అదనంగా పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తూ అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు సన్నద్ధమవుతోంది. సబ్సిడీ విత్తనాలను సైతం అందించనున్నారు. జిల్లాలో వివిధ గోదాములు, హోల్‌సేల్, రిటైల్, మార్క్‌ఫెడ్ వద్ద ఎరువులు 79,841 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచిస్తున్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మే నెలలోనే వరుణుడు కరుణించడంతో ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధమయ్యారు. జిల్లా వ్యవసాయశాఖ, కృషి విజ్ఞాన కేంద్రం ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేశాయి. విత్తనాల నుంచి ఎరువుల వరకు ఎంత మేరకు అవసరమనే దానిపై అధికారులు అంచనాలు రూపొందించారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, కేవలం పెట్టుబడి నిధి విడుదల చేసి చేతులు దులుపుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక విజన్-2047 ప్రణాళికతో ముందుకు వెళుతోంది. 2025-26 సంవత్సరంలో ప్రధాన పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, అపరాల విస్తీర్ణం పెంచడమే కాకుండా పంట దిగుబడులు పెంచేందుకు ప్రణాళికతో అడుగులు వేస్తోంది.



ట్రాక్టర్‌తో దున్నుతున్న దృశ్యం

లక్ష్యాన్ని అధిగమించేందుకు..

వ్యవసాయశాఖ గత ఖరీఫ్ సీజన్‌లో 2.6లక్షల హెక్టార్ల లక్ష్యంతో ముందుకెళ్లి 100శాతం ఫలితాన్ని సాధించింది. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉండడంతో మరో 40వేల హెక్టార్లలో అదనంగా పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తూ అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు సన్నద్ధమవుతోంది. ప్రధాన పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, ఇతర అపరాల సాగు విస్తీర్ణంతో పాటు మంచి దిగుబడులు పెంచేవిధంగా నియోజకవర్గాల వారీగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.



సబ్సిడీ ఇలా...

జిల్లాలో ముందుగా వేరుశనగ విత్తనాలకు 40శాతం సబ్సిడీ, గిరిజన ప్రాంత రైతులకు 90శాతం సబ్సిడీతో విత్తనాలను అందించనున్నారు.

వేరుశనగ సబ్సిడీ: వేరుశనగలో కే6, టీసీజీఎస్, టీఏజీ224 రకాల అసలు ధర రూ. 9300 కాగా 40శాతంతో సబ్సిడీ రూ. 5580 గిరిజన ప్రాంత రైతులకు రూ.930కు అందజేయనున్నారు. నారాయణి రకం అసలు ధర రూ. 9,500, సబ్సిడీతో రూ.5,700, గిరిజన ప్రాంత రైతులకు రూ. 950, కదిరిలేపాక్షి రకం అసలు ధర రూ.8,200, సబ్సిడీతో రూ.4,920, గిరిజన ప్రాంత రైతులకు రూ.820కు అందిస్తారు.

మినుములు : పీయూ31, ఎల్‌బీజీ752, ఐపీయూ243, టీబీజీ104, ఎల్‌జీజీ 630, వీబీఎన్8తో పాటు ఇతర రకాలు క్వింటా అసలు ధర రూ.13,800 కాగా 40శాతం సబ్సిడీతో రూ.9,660, గిరిజన ప్రాంత రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.1,380కు అందజేస్తారు.

మిగతా 6వ పేజీలో



కేవీకే విత్తన విక్రయ కేంద్రం

సబ్సిడీ విత్తనాలు కేటాయింపు ఇలా..

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వేరుశనగ విత్తనాల్లో కే6 రకం 2009 క్వింటాళ్లు, కందులు విత్తనాల్లో ఎల్‌ఆర్‌జీ105 రకం 150క్వింటాళ్లు, టీఆర్‌జీ59 రకం 200క్వింటాళ్లు, పీఆర్‌జీ176 రకం 200క్వింటాళ్లు, ఐసీపీఎల్87119 రకం రెండు వేల క్వింటాళ్లు, మినుముల విత్తనాల్లో టీబీజీ129 రకం 73 క్వింటాళ్లు, ఎల్‌బీజీ85 రకం 72 క్వింటాళ్లు, వీబీఎన్8 రకం 600క్వింటాళ్లు, పెసలు విత్తనాల్లో ఎల్‌జీజీ630 రకం 20క్వింటాళ్లు, కొర్ర విత్తనాల్లో సూర్యనంది రకం 20క్వింటాళ్లు, ఎస్ఎల్ఏ3156 రకం 75క్వింటాళ్లు, వరి విత్తనాల్లో బీపీటీ2846 50క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్1548 రకం 150 క్వింటాళ్లు, ఎంటీయూ1271 రకం 100క్వింటాళ్లు మొదటి విడతగా కేటాయించారు. అలాగే పచ్చిరొట్టె విత్తనాలైన జీలుగలు 3023 క్వింటాళ్లు, పిల్లిపెసర 19క్వింటాళ్లు కేటాయించారు. మొత్తంగా 8,766 క్వింటాళ్లు సిద్ధం చేశారు.

స్కాలర్‌షిప్ పరీక్షా ఫలితాలు విడుదల

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జాతీయ ఉపకార వేతనం(స్కాలర్‌షిప్) పరీక్షా ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులు వెబ్ మెరిట్‌కార్డులను ప్రభుత్వ పరీక్షల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులు వెంటనే బ్యాంక్ అకౌంట్ తెరిచి, విద్యార్థి ఆధార్‌తో లింక్ చేయించుకోవాలని తద్వారా డీబీటీ ద్వారా డబ్బులు జమ చేస్తారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి మెరిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి వివరాలు సమర్పించి విద్యామంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారి స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అప్లికేషన్‌ను సబ్మిట్ చేయాలని కోరారు. అనంతరం సంబంధిత పాఠశాల నోడల్ ఆఫీసర్ కానీ, జిల్లా నోడల్ అధికారి లాగిన్‌ల ద్వారా అప్రూవ్ చేయించుకోవాలని సూచించారు. ముద్రించిన మెరిట్ కార్డులను త్వరలో సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపిస్తారని తెలిపారు.

రూ.1.81 కోట్ల నిధులు మంజూరు

నంద్యాల మున్సిపాలిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్బీసీ సర్కిల్ 2 పరిధిలోని ప్రధాన కాలువల నిర్వాహణ, మరమ్మతులకు 2025-26 సంవత్సరానికి రూ. 1.81 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎస్సార్బీసీ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు, పూడికతీత, కట్టల లోపేతం పనులు చేపడుతారని పేర్కొన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు కింద గతేడాది రూ.119.6లక్షల నిధులు మంజూరైనట్లు ఎస్ఈ వివరించారు.

ఈనెల 15నుంచి ప్రత్యేక క్యాంపులు

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కేవీ శివప్రసాద్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఐటీడీఏ పరిధిలో గిరిజనుల సమగ్రాభివృద్ధికి ఈనెల 15వ తేదీ నుంచి 30వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కేవీ శివప్రసాద్ తెలిపారు. సోమవారం శ్రీశైలం సున్నిపెంటలోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ధరీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' కింద జిల్లాలో రెండు గిరిజన మండలాలు ఎంపికైనట్లు తెలిపారు. బనగానపల్లె మండలంలోని రాళ్లకొత్తూరు, గుల్లమలియాబాత్ తాండా, ఆత్మకూరు మండలంలోని బైర్లూటి గ్రామాలు ఎంపికకయ్యాయన్నారు. ఆ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, పిల్లల సంరక్షణ, మెరుగైన జీవనోపాధి అవకాశాలే పథకం లక్ష్యమన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి అన్నిరకాల ప్రభుత్వ ప్రయోజిత గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు.

యోగాతో జీవితంలో మార్పులు

- నిత్య సాధనతో సంపూర్ణ ఆరోగ్యం
- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్
- జెండా ఊపి యోగాంధ్ర ర్యాలీ ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న జేసీ, జిల్లా అధికారులు

నంద్యాల టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడంతో రోజువారి జీవితంలో మార్పులు జరుగుతాయని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. సోమవారం యోగాంధ్ర ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి ఇండోర్ స్టేడియం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిరోజు యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజుల పాటు యోగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాస్టర్స్ ట్రైనర్స్ ద్వారా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, పుణ్య క్షేత్రాలు వంటిలో ప్రదేశాల్లో కూడా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఆయుష్ సీనియర్ మెడికల్ అధికారి యశోధర, జిల్లా అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- నంద్యాలలో 40.4 మి.మీ. వర్షపాతం
- మహానందిలో 1,100 ఎకరాల్లో పంటనష్టం



నేల వాలిన అరటిచెట్లు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటకు 70నుంచి 80 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలుల ధాటికి అరటి పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులకు అపారనష్టం వాటిల్లింది. నంద్యాల పట్టణంలో అత్యధికంగా 40.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. శ్రీశైలంలో 30.4 మి.మీ., నంద్యాల రూరల్‌లో 29, డోన్‌లో 26.8, గోస్పాడులో 25.4, బండిఆత్మకూరులో 21.8, మహానందిలో 21, ప్యాపిలి 5.2, పాణ్యం 3.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మహానంది మండలంలో 1,100 ఎకరాల్లో అరటి, 20 ఎకరాల్లో బొప్పాయి దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సోమవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, ఏడీ శ్రీధర్‌లు పంటలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో పంట నష్టపరిహారాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే అవార్డులు

- విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరాలి
- రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- విద్యా రంగానికి పెద్దపీట : కలెక్టర్ రాజకుమారి
- షైనింగ్ స్టార్స్-2025 అవార్డులు ప్రదానం



విద్యార్థులకు ప్రశంసాపత్రం, నగదు అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్ జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన ప్రతిభను వెలికి తీసేందుకు అవార్డులు దోహదపడుతాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల మండల పరిధిలోని ఏఎస్ఆర్ కల్యాణ మండపంలో పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. విద్యలో నాణ్యత, నైపుణ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో 182మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20వేలు నగదు, ప్రశంసా పత్రం ఇవ్వడం గర్వకారణమన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి మంచి ఫలితాలు సాధించిన అవార్డు గ్రహీతలను అభినందించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రెడ్డి, ఆర్డీవో చల్లా విశ్వనాథ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అఖిలప్రియకు అస్వస్థత 7

చెదిరిన గూడు!

- అనారోగ్యంతో నాన్న
- ఆవేదనతో అమ్మ మృతి
- 40 రోజుల్లో తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులు
- చాగలమర్రిలో కన్నీటి ఘటన

7

మహిళల జోలికొస్తే ఖబడ్దార్

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

27న డాక్ అదాలత్

కర్నూలు న్యూసిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో అందిస్తున్న సేవలపై ఈనెల 27న డాక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దనరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండు వద్ద ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. డాక్ అదాలత్‌లో పోస్టాఫీసు సేవలపై ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే పోస్టు కవర్ ద్వారా పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దనరెడ్డి, కర్నూలు డివిజనల్ కార్యాలయం, పాతబస్టాండు అడ్రసుకు ఈ నెల 23వ తేదీలోగా పంపాని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజాసమస్యలను వేగంగా పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్
- పీజీఆర్ఎస్‌కు 205 దరఖాస్తులు

నంద్యాల నూనెపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిశీలించి వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సమస్యలను వివరించేందుకు ప్రజలు వచ్చారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం నుంచి 205 దరఖాస్తులను స్వీకరించినట్లు జేసీ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో వంద శాతం నమోదు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఇప్పటివరకు యోగాంధ్రలో శిక్షణ ఇస్తున్నవారి వేదిక, రిజిస్ట్రేషన్స్ పూర్తికావాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

ఆలయాల్లో పురాతన కట్టడాలను కాపాడుతాం

- శ్రీశైలంలో రూ.6కోట్లతో రాతి కట్టడాల ఆధునికీకరణ
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- మహానందీశ్వరుడి ఆశీస్సులతో రాజకీయాల్లో ఎదిగా
- న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- ఆలయ పరిసరాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

మహానంది, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పురాతన కట్టడాలను కాపాడేందుకు చర్యలు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మహానంది ఆలయంలో భక్తుల వసతి కల్పనలో భాగంగా దేవదాయ శాఖ నిధులతో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆలయం సమీపంలో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న 55 వసతి గదుల సముదాయానికి భూమిపూజ, రూ.75 లక్షలతో ఏర్పాటు చేసిన స్టెయిన్ లెస్ స్టీల్ క్యూలైన్ పనులను ప్రారంభించారు. టీటీడీ రూ.1.60 కోట్లతో నిర్మించిన డార్మెంటరీ ప్రారంభం, రూ.3 కోట్ల టీటీడీ నిధులతో నిర్మిస్తున్న 16 గదుల వసతి సముదాయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం ఆలయంలో ఒక స్వచ్ఛంద సంస్థ రూ.6కోట్లతో రాతి కట్టడాలను ఆధునికీకరిస్తుందన్నారు. మహానంది క్షేత్రంలో కూడ పురాతన కట్టడాలను కాపాడేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. విదేశాల్లోని ఆలయాల్లో రాతికట్టడాలకు నంద్యాల జిల్లాలోని ఆళ్ళగడ్డ నుంచి గ్రానైట్ రాళ్లను తరలిస్తున్నారని చెప్పారు. జిల్లాలో దేవదాయశాఖ పరిధిలో 200 ఆలయాలు రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయన్నారు. సిక్స్ ఏ, సిక్స్ బి, సిక్స్ సి, సిక్స్ డి కింద రూ 7.34 కోట్ల నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ఆలయాల మాన్యం అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చట్టం తెచ్చామన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్

మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నికైన నాటి నుంచి తనకు మహానందితో ఎంతో అనుబంధం ఉందన్నారు. మహానందీశ్వరుడి ఆశీస్సులతోనే తాను ఇంతటి స్థాయికి ఎదిగానని తెలిపారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహానంది క్షేత్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు, మండలంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



డార్మెంటరీని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే

ఎంజాయ్


ఆట, పాటల సరదాల పార్కు



- సుందరంగా నంద్యాల చిన్నపార్కు
- బెంగళూరు, హైదరాబాద్ తరహాలో అభివృద్ధి
- పచ్చదనంతో పాటు బోటింగ్ సదుపాయం
- ఫొటో, వెడ్డింగ్ షూట్లకు సౌకర్యాలు
- సెలవులు, సాయంత్రం వేళల్లో సందడే.. సందడి


చిన్నారులకు కలర్ బాల్స్ బాస్కెట్


చెరువులో బోటు షికారు

నంద్యాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నచెరువు స్థానికులకు ఆహ్లాదాన్ని అందిస్తోంది. తక్కువ ఖర్చుతో పిల్లలు, పెద్దలకు అన్నీ లభించేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బెంగళూరు, హైదరాబాదులో ఉండే పార్కు తరహాలో పార్కును వైభవంగా విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేశారు. పచ్చదనంతో పాటు చెరువులో బోటింగ్ సదుపాయం ఉంది. ఎగ్జిబిషన్ తరహాలో పిల్లలకు తగిన ఉయ్యాలలు, జారుడు బండ.. చిన్ని పిల్లల బోటింగ్ తొట్టే.. ఎగిరే మ్యాట్ తదితర ఏర్పాట్లు చేయడంతో కనువిందుగా ఉంది. వీటికి తోడు ఫొటో, వెడ్డింగ్ షూట్‌లకు సైతం తగిన విధంగా ఏర్పాట్లు ఉండటం యువతీ యువకులకు మరింత కలిసివస్తోంది. ఇదే క్రమంలో నగరవాసులు సైతం ఏమాత్రం సమయం దొరికినా.. సాయంత్రం వేళల్లో తమపిల్లలతో కలిసి ఈపార్కుకు తరలిరావడంతో సందడి.. సందడిగా కనిపిస్తోంది. శని, ఆదివారాల్లో, సెలవుల్లో దినాల్లో అయితే రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. రెస్టారెంట్, హోటల్. తినుబండారుల సదుపాయం కూడా ఉంది. ఏదిఏమైనా నంద్యాల వాసులకు చిన్నపార్కుతో పెద్ద సంతోషమే దక్కిందని చెప్పవచ్చు.



(5వ పేజీ తరువాయి)

పెసలు విత్తనాలు : ఐపీఎం2-14, ఐపీఎం205-7, ఎల్‌జీజీ630, ఐపీఎం410-3రకాలతో పాటు ఇతర రకాల క్వింటా అసలు ధర రూ.13,500 కాగా 40శాతం సబ్సిడీతో రూ.9450లు, గిరిజన ప్రాంత రైతులకు రూ.1350కు అందజేస్తున్నారు.

కందులు : ఎల్‌ఆర్‌జీ52, ఎల్‌ఆర్‌జీ105, పీఆర్‌జీ176, ఐసీపీఎల్87119 రకం విత్తనాలతో పాటు ఇతర రకాలు క్వింటా సబ్సిడీతో రూ.9,855, గిరిజన ప్రాంత రైతులకు రూ.1,095లకు అందజేస్తున్నారు.

కొర్రలు.. :ఎస్‌ఐఏ3156, ఎస్‌ఐఏ3159 విత్తనాలతో పాటు ఇతర రకాలు క్వింటా 40శాతం సబ్సిడీతో రూ.9855, గిరిజన ప్రాంత రైతులకు రూ.1,095కు అందజేస్తున్నారు.

రాగులు సబ్సిడీ ఇలా.. : ఇంద్రావతి, వేగావతి, వీఎల్379 రకాలతో ఇతర రకాలు క్వింటా రూ.6,900 కాగా 40శాతం సబ్సిడీతో రూ.3,450, గిరిజన ప్రాంత రైతులకు రూ.690కు అందజేస్తున్నారు.

జిల్లాలో వివిధ గోదాములు..

జిల్లాలో వివిధ గోదాములు, హోల్‌సేల్, రిటైల్, మార్క్‌ఫెడ్ వద్ద ఎరువులు 79,841 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. ఎరువుల వల్ల రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా బఫర్ స్టాక్ కంటే నిల్వలున్నాయి.

రైతులకు ఖరీఫ్ పంటలపై..

బనగానపల్లె కృషివిజ్ఞాన కేంద్రం రైతులకు ఖరీఫ్ పంటలపై అవగాహన కల్పిస్తూనే సబ్సిడీతో కూడా విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త తమ కేంద్రంలో అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలను వెల్లడించారు. ఎన్‌డీఎల్ఆర్, బీపీటీ 5204 రకం వరి, మినుములు వీబీఎన్8, వీబీఎన్10, టీబీజీ 104 రకాలు 600 క్వింటాళ్లు, కొర్రలు సూర్యనంది రకం 200క్వింటాళ్లు, కందులు ఎల్ఆర్‌జీ52, పీఆర్‌జీ 176, డబ్ల్యూఆర్‌జీ 93, డబ్ల్యూఆర్‌జీ 97, డబ్ల్యూఆర్‌జీ 255 రకం 800క్వింటాళ్లు, ఆముదాలు ఐసీహెచ్5 రకం 5 క్వింటాళ్లు, సజ్జలు 10క్వింటాళ్లు, సోయాబీన్ 118 క్వింటాళ్లు, సన్‌ఫ్లవర్ ఐఎస్ఎఫ్ 764 రకం 5 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా..



సాగు విస్తీర్ణం పెంచుతాం



గత ఏడాది కంటే ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండడంతో సాగు విస్తీర్ణం కూడా పెంచేందుకు కృషిచేస్తాం. రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించడంతో అధిక దిగుబడులు సాధించొచ్చు. ప్రభుత్వం జిల్లాకు విత్తనాల కోసం రూ.268.4లక్షలు సబ్సిడీ కేటాయించింది.

● మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో వ్యవసాయ దిగుబడిని పెంచడానికి కేవీకే ఆధ్వర్యంలో మే 29వ తేదీ నుంచి 15 రోజుల పాటు 135 గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించబోతున్నాం. కేవీకేలో అన్నిరకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. రైతులు సందర్శించి విత్తనాలను పరిశీలించి కొనుగోలు చేయవచ్చు.

●డాక్టర్ ధనలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే

రైతులు ఆందోళన చెందొద్దు



జిల్లాలో బఫర్‌స్టాక్ కంటే ఎరువులు అధికంగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధిక మోతాదులో కాంప్లెక్స్ ఎరువులను వాడకుండా వ్యవసాయాధికారుల సూచనలను పాటించి ఎరువులు వాడడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులుండవు.

● హరినాథరెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజర్, నంద్యాల

మహానందిలో మంత్రులు

- ఘనస్వాగతం పలికిన ఆలయ ఈవో, అర్చకులు
- స్వామివారి జ్ఞాపికలు అందజేత


మహానందిలో రాష్ట్ర మంత్రులకు స్వామి వారి జ్ఞాపికలను అందజేస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మంటపంలో మంత్రులను వేదపండితులు ఆశీర్వదించారు. ఈవో శాలువాలతో సన్మానించి స్వామివారి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి, ఏఈవో యర్రమల్ల మధుతోపాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోసిగిలో మాతృమరణంపై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హస్పిటల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలో ఏప్రిల్ నెలలో జరిగిన బాలింత మృతిపై డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పెద్దహరివాణం నుంచి కోసిగి పీహెచ్‌సీకి కాన్పు కోసం వచ్చిన బాలింత మృతిపై గల కారణలపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భవతులను తొందరగా గుర్తించి వారికి సరైన సమయంలో సేవలు అందిస్తే మాతృ మరణాలు తగ్గుతాయన్నారు. ఒకవేళ గర్భవతులను హైరిస్క్‌గా గుర్తించినట్లు ఆశా, ఆరోగ్య కార్యకర్త పర్యవేక్షణలతో ట్రాక్ చేసి సమీప సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భవతులను కాన్పు తేదీకి మూడు రోజుల ముందుగానే ట్యాగ్ చేసిన వారిని ఆసుపత్రిలో అడ్మిషన్ అయ్యేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో డీఐవో, డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి నాగేంద్ర ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, గైనకాలజీ హెచ్‌వోడీ శ్రీలక్ష్మి, అనస్థీషియా ప్రొఫెసర్ సుధీర్ కుమార్, డీపీహెచ్ఎన్‌వో అన్నపూర్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు అభిరూప్, ఇర్ఫాన్‌బాషా, పీహెచ్ఎన్ మీనాక్షి, ఎంపీహెచ్ ఈవో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

రేపు కాకినాడలో కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల హస్పిటల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బాల, బాలికల జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు బుధవారం కాకినాడలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యుడు సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని జేఎన్‌టీయూ మైదానంలో ఈనెల 11వ తేదీ ఉదయం 7గంటలకు ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్-18 విభాగంలో ప్రతిభ కనబరచిన బాల, బాలికల ఆంధ్రా జట్లకు ఎంపిక చేస్తారని, ఎంపికైన ఏపీ జట్లు ఈ నెల 28నుంచి జూలై 1వరకు హరిద్వార్‌లో జరిగే జాతీయస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు నేరుగా ఆధార్‌కార్డుతో కాకినాడకు వెళ్లి పాల్గొనవచ్చని సూచించారు. బాల, బాలికలు డిసెంబరు 31నాటికి 18సంవత్సరాలు దాటరాదని, బాలురు 70కేజీలు, బాలికలు 60కేజీల్లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9441243601 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం విజన్ ప్లాన్

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- సీపీవోలో యూనిట్ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, జేసీ బి.నవ్య

కర్నూలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సోమవారం సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 26 జిల్లాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను, 175 నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి భరత్‌తో పాటు జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీ.క్యాంపు క్రీడా మైదానంలో ఈ నెల 11వ తేదీన స్త్రీ, పురుషులకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి బి.లక్ష్మయ్య తెలిపారు. 18 సంవత్సరాలు వయస్సు పైబడిన ఎంపికకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అథ్లెట్స్ ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెట్స్ చాంపియన్‌షిప్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పాటు రూ.300 ప్రవేశ రుసుంతో హాజరు కావాలన్నారు.

ఆశల సాగు ఆవిరి..!

- భారీగా పతనమైన బొప్పాయి ధర
- గత నెల టన్ను రూ.20 వేలు
- ప్రస్తుతం రూ.5 వేలకు పతనం
- తోటలను దున్నేస్తున్న రైతులు


బొప్పాయి చెట్లకు కాచిన కాయలతోనే వదిలేసిన పంట పొలం

చాగలమర్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో పంటలను సాగు చేసిన రైతుకు వరుస నష్టాలు ఎదురవుతున్నాయి. పండ్ల తోటల సాగుతోనైనా కష్టాలు గట్టెక్కుతాయనుకున్న ఆ రైతుకు మళ్లీ నిరాశే ఎదురైంది. ధర లేక బొప్పాయి రైతులు కుదేలవుతున్నారు. పెట్టుబడి కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే టన్నుకు రూ.15 వేలకు పైగా ధర పడిపోవడంతో ఏమి చేయాలో రైతులకు దిక్కుతోచలేదు. చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో సోమవారం కొందరు రైతులు ఆశలు వదులుకొని బొప్పాయి తోటలను ట్రాక్టర్లతో దున్నేశారు. ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశామని, ధరలు లేక బొప్పాయి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు శీలం అంకిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి, సందీశ్వర్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 20 ఎకరాల దాకా బొప్పాయి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. కొందరు రైతులు బొప్పాయి చెట్లకే కాయలను వదిలేశారు. గత రెండు నెలల క్రితం టన్ను రూ.20 వేలు పలికిందని, ప్రస్తుతం ధర రూ.5 వేలకు పడిపోయిందని వాపోయారు. చెట్లకు కాయలు ఉన్నా పెట్టుబడులు కూడా రావని ట్రాక్టర్లతో దున్నేస్తున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలు, వైరస్ వల్ల కూడా పంట దెబ్బతిందని రైతులు విలపించారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.


చిన్నవంగలిలో బొప్పాయి తోటను దున్నేస్తున్న రైతు

పోలీసులకు 95 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 95మంది తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. తన నలుగురు కుమారులు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన కె.సుంకులమ్మ ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. తన కుమారుడు వినయ్ కుమార్ (34) ఏడాది నుంచి కనిపించడం లేదని ఆచూకీ తెలపాలని కర్నూలు జోహరాపురం గ్రామానికి చెందిన స్వామిదాసు ఫిర్యాదు చేశాడు. వెల్దుర్తికి చెందిన శ్రీశైలం వాసు తన పొలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని కర్నూలు చెందిన రవి ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా తమ పొలానికి వెళ్లకుండా కంచె అడ్డు వేసి బెదిరిస్తున్నారని సీ.బెళగల్ మండలం కంపాడు గ్రామానికి చెందిన పార్వతి వెంకటేశ్, గోవిందుపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ హుశేన్‌పీరా, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోపై వచ్చిన ఆరోపణలపై విచారణ

11న విచారణకు రావాలని వీఆర్‌ఓలకు జేసీ నోటీసులు

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, ఆయన క్యాంప్ క్లర్క్‌పై వచ్చిన అక్రమ వసూళ్లు, వేధింపుల ఆరోపణలపై జాయింట్ కలెక్టర్ బి.నవ్య విచారణకు ఆదేశించారు. 11వ తేదీ బుధవారం ఉదయం విచారణకు హాజరు కావాలని పత్తికొండ డివిజన్ వీఆర్వోల అసోసియేషన్ సభ్యులతో పాటు డివిజన్ పరిధిలోని ప్రతి మండలం నుంచి ఇద్దరు గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్‌వో)లు హాజరు కావాలని సోమవారం జేసీ నోటీసులు జారీ చేశారు. ఆర్డీవోతో పాటు ఆయన క్యాంప్ క్లర్క్ అక్రమ వసూళ్లు చేయాలని, వివిధ రకాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ పత్తికొండ డివిజన్ వీఆర్వోల అసోసియేషన్ పేరిట జిల్లా కలెక్టర్, ఏపీ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)కు గత నెల 20వ తేదీన ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను పంపాలని సీసీఎల్‌ఏ అధికారులు కర్నూలు జేసీ నవ్యను ఆదేశించారు. ఇదిలా ఉండగా మండలానికి ఇద్దరు వీఆర్వోలు మాత్రమే హాజరుకావాలని కోరడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనూరాధ అర్జీలను స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను అధికారులు స్వీకరించి ఆయా శాఖలకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా పీడీ చిరంజీవి మాట్లాడుతూ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. కాగా కలెక్టర్, జేసీలు వేర్వేరు కార్యక్రమాలతో బిజీగా ఉన్న నేపథ్యంలో హౌసింగ్ పీడీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజా వినతులను స్వీకరించారు.


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ఏమైందమ్మా..
ఎందుకమ్మా.. ఇలా చేశావు..?
మొన్న నాన్న, నేడు నువ్వు
మమ్మల్ని ఇలా వదిలేసి
వెళ్లిపోయారు.. ఎందుకమ్మా?
రాత్రి కడుపునిండా అన్నం పెట్టి
ప్రేమతో హత్తుకుని పడుకున్నావు..
తెల్లారేసరికి
మంటల్లో కలసిపోయావు
రాత్రే కదమ్మా హాయిగా నవ్వి..
నుదుటిపై ముద్దుపెట్టి
కలసి పడుకున్నాం..
తెల్లారేసరికి ఎక్కడకు వెళ్లావమ్మా..?
భరోసానిచ్చే నాన్న
బాధ్యతగా పెంచే అమ్మ
లేకపోతే మేమెలా బతకాలి
అమ్మా, నాన్న లేని
మాకు ఇంకెవరు దిక్కు?
మా చదువులు,
మా బతుకులు చూసేదెవరు
లాలించి, ఆడించి
ఇష్టమైనవి కొనిపెట్టేదెవరు?
అవన్నీ మాకేం వద్దమ్మా..
మాకు మీరే కావాలి..
మీరే కావాలి..!


అమ్మానాన్నల ప్రేమకు దూరమైన చిన్నారులు జాహ్నవి, హరిత

గూడు చెదిరి... గుండె పగిలి...


40 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన తండ్రి పవన్

- అనారోగ్యంతో నాన్న...ఆవేదనతో అమ్మ మృతి
- 40 రోజుల్లో తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులు

చాగలమర్రిలో విషాద ఘటన


ఆత్మహత్య చేసుకున్న మహేశ్వరి (ఫైల్)

చాగలమర్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చూడ చక్కని ఇద్దరు ఆడబిడ్డలు.. తల్లిదండ్రులతో హాయిగా సాగిపోతున్న వారి జీవితాన్ని అప్పులు, అనారోగ్యం కుదిపేశాయి. రుణదాతలను మోసం చేయలేకపోయిన ఆ తండ్రి ఉన్న నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలను అమ్మేసి అప్పులు తీర్చాడు. అయినా కాస్త అప్పులు ఉండటం, దానికి తోడు అనారోగ్యం తోడు కావడంతో సరిగ్గా 40 రోజుల క్రితం మృతి చెందాడు. ప్రేమగా చూసుకునే భర్త లేకపోవడంతో ఆ తల్లి కూడా కన్నీటిని దిగమింగి బిడ్డలకు కడుపు నిండా అన్నం పెట్టి వారు నిద్రలోకి వెళ్లాక... ఈమె శాశ్వత నిద్రలోకి వెళ్లింది. బిడ్డలకు ఏమీ కాకూడదని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. 50 రోజుల క్రితం సంతోషంగా కనిపించిన ఆ కుటుంబం చెల్లాచెదురైంది. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ బిడ్డలు అనాథలయ్యారు. ఈ ఘటన చాగలమర్రి మండలంలో చోటు చేసుకుంది.

చాగలమర్రి గ్రామంలోని న్యూబిల్డింగ్స్ వీధిలో నివాసం ఉంటున్న వివాహిత మహిళ మహేశ్వరి (30) ఆర్థిక ఇబ్బందుల కారణంతో నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చిన్నవంగలి గ్రామానికి చెందిన పవన్, మహేశ్వరికి పదేళ్ల క్రితం వివాహం అయింది. వారు చాగలమర్రిలో అద్దె భవనంలో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. స్వగ్రామంలో 4 ఎకరాల పొలం ఉండగా అప్పుల ఒత్తిడి తట్టుకోలేక 2 ఎకరాలను విక్రయించి కొంతమేర అప్పులు చెల్లించారు. 40 రోజుల క్రితం అనారోగ్యంతో భర్త పవన్ మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు, భర్త లేని లోటుతో భార్య మహేశ్వరి ఒత్తిడికి లోనైంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇద్దరు కుమార్తెలు జాహ్నవి, హరితలకు కడుపు నిండా ఇష్టమైన భోజనం చేసి తండ్రితో కలిసి మహేశ్వరి తినింది. తన ఇద్దరి బిడ్డలను హత్తుకుని నుదుటిపై ముద్దాడుతూ.. 'మంచిగా ఉండాలి. ఎవరితోనూ గొడవలు పెట్టుకోవద్దు. ఎక్కడ ఉన్నా ఏమైనా మీకోసం నాప్రాణం..' అంటూ బిడ్డలకు చెప్పుకుంది. అనంతరం బిడ్డలు నిద్రలోకి వెళ్లాక పక్క గదిలోని ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. మహేశ్వరి తండ్రి కృష్ణమూర్తి, చిన్నారులు జాహ్నవి, హరితలను పక్క గదిలో నిద్రించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గృహంలో నుంచి మంటలు వ్యాపించడంతో పక్కనే నివాసం ఉంటున్న విశ్రాంత ఈవో మారుతీప్రసాద్, మల్లేశ్వరరావులు స్పందించి మంటల వేడిని తట్టుకోలేక కేకలు వేశారు. చిన్నారులను, కృష్ణమూర్తిని సాహసంతో బయటకు తరలించారు. ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే మంటల్లో మహేశ్వరి కాలిపోయింది. గృహంలో ఉన్న నగదు, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మహేశ్వరిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


మహేశ్వరి ఆత్మహత్య చేసుకున్న గదిలో దగ్ధమైన నగదు, వస్తువులు

తల్లిదండ్రులను కోల్పోయి గూడు చెదిరిన పక్షుల్లా చిన్నారులు జాహ్నవి(7), హరిత(4)లు మిగిలారు. భర్త చనిపోయిన మహేశ్వరి పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగించేది. తన తండ్రి కృష్ణమూర్తికి ఎవరు లేక పోవడంతో ఆమె వద్దే ఉంటూ కాలం గడుపుతున్నాడు. తల్లి మంటల్లో కాలి చనిపోవడంతో ఆ చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలుగా మిగిలారు. ఈ సంఘటన పలువురిని కలచివేసింది.

దేవరలో విద్యుదాఘాతంతో మహిళ మృతి

- మరో ముగ్గురికి అస్వస్థత

దొర్నిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ దేవరలో సోమవారం ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మరో ముగ్గురు మహిళలు అస్వస్థతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. దొర్నిపాడుకు చెందిన బోయ బాల ఉసేని భార్య ఉష పెద్దమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం డబ్ల్యూ.గోవిందిన్నెకు చేరుకుంది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఇనుప స్తంభానికి లైట్ ఏర్పాటుచేశారు. విద్యుత్‌తీగ కాస్త తెగి స్తంభానికి తగిలి ఉండటంతో ప్రమాదవశాత్తు ఉష విద్యుత్ షాక్‌కు గురై స్పృహ కోల్పోయింది. తోటి భక్తులు గమనించి ఉషను తప్పించబోయారు. దీంతో మరో ముగ్గురికి షాక్ తగలడంతో అస్వస్థతకు గురయ్యారు. వీరందరిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఉష మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కంకరమిషన్ కింద పడి కాంట్రాక్టర్ దుర్మరణం

- మృతుడు హైదరాబాద్ వాసి

బనగానపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కంకర మిషన్ కిందపడి ఓ కాంట్రాక్టర్ సోమవారం దుర్మరణం చెందాడు. పట్టణ సమీపంలో రైల్వేస్టేషన్ వద్ద ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ అజయ్(59) బనగానపల్లె రైల్వేస్టేషన్ వద్ద పనులు చేయిస్తున్నాడు. ఈనేపథ్యంలో కంకర, సిమెంట్ కలిపే మిషన్ డ్రైవర్ కంకరమిషన్, సిమెంట్ కలిపి ఆ మిశ్రమాన్ని సమీపంలోని ప్రాంతానికి తీసుకువెళ్లడానికి వాహనాన్ని నడుపుతున్నాడు. అదే సమయంలో కాంట్రాక్టరు సెల్‌ఫోన్‌లో వేరే వారితో మాట్లాడుతుండగా కంకరమిషన్ వెనుకవైపు నుంచి తగిలి మిషన్ టైరుకింద పడి తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే రైల్వే ఉద్యోగులు, ఇతర సిబ్బంది కొనఊపిరితో ఉన్న అజయ్‌ను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కాంట్రాక్టర్ బంధువుల ఫిర్యాదు మేరకు మిషన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక..

పెద్దకడుబూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగిన బాలిక చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పెద్దకడుబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన కురువ నాగవేణి (14) ఈనెల 4వ తేదీన కౌతాళం మండలం ఉరుకుంద గ్రామానికి ఓ పెళ్లికి వెళ్లింది. అక్కడ తన బంగారం పోగొట్టుకోవడంతో తల్లిదండ్రులు కొడుతారని భయపడింది. ఈనెల 6వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలిక మరణించింది. మృతురాలి తండ్రి కురువ అయ్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

- పావు కిలో బంగారం, కిలో వెండి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్

నంద్యాల టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పలు దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరిని నంద్యాల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం నంద్యాల సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శివశంకర్ అలియాస్ లడ్డు రాయవరం కోనసీమ జిల్లా, కోరాడ వెంటేశ్వరావు, బిక్కవోలు రాజమహేంద్రవరం జిల్లా ఇద్దరు కలసి పలుచోట్ల దొంగతనాలు చేసేవారు. వీరిద్దరిపై పశ్చిమగోదావరి జిల్లా రేవనూరు, గుంటూరు, హైదరాబాద్, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఒకరిపై 20 కేసులు, మరొకరిపై 40 దొంగతనం కేసులు నమోదయ్యాయి. వీరు ఉదయంపూట రెక్కీ నిర్వహిస్తూ ఇళ్లల్లో ఎవరూ లేని చూసి తాళాలు ధ్వంసం చేసి దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో నంద్యాల జరిగిన ఓ చోరీ కేసులో నిందితులపై కేసు నమోదైంది. నంద్యాల ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పాణ్యం మండలంలోని సుగాలిమెట్ట వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పావుకిలో బంగారు, కిలో వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టులో కీలక పాత్ర పోషించిన పోలీసులను ప్రత్యేకంగా అభినందిచారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ సురేశ్‌కుమార్, పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, తాలుకా సీఐ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల జోలికొస్తే ఖబడ్దార్

- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్
- సాక్షి కార్యాలయం ఎదుట జగన్ దిష్టిబొమ్మ దహనం


జగన్ దిష్టిబొమ్మ, సాక్షి ప్రతులను దహనం చేస్తున్న నాయకులు


నిరసన తెలుపుతున్న మహిళలు

కల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి, మహిళల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ మెంబర్ మల్లెల రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం సాక్షి కార్యాలయం ముందు మహిళలు ధర్నా చేసి జగన్ దిష్టిబొమ్మను, సాక్షి పేపర్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మల్లెల మాట్లాడుతూ ఈనెల 6న సాక్షి టీవీ డిబేట్‌లో రాజధాని మహిళలను వేశ్యలుగా పేర్కొన్న కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై సుమోటోగా కేసు నమోదుచేసి కోర్టులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసీపీ మహిళా నాయకులు, భారతీరెడ్డి కూడా అక్కడే నివాసం ఉంటున్నారని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ కళ్లల్లో ఆనందం కోసం కొందరు పనికట్టుకొని మహిళలపై మతిభ్రమించి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత వైసీపీ పాలనలో అమరావతిపై జగన్ కక్ష సాధించారని, అదే పంథాను ఇప్పుడు కొనసాగిస్తూ వివక్ష చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలు, టీడీపీ నాయకుల జోలికి వస్తే ఇళ్లలోకి వచ్చి కొడతామని మల్లెల హెచ్చరించారు. కార్యక్రమంలో కల్లూరు మండల టీడీపీ కన్వీనర్ డి.రామాంజనేయులు, వాకిటి మాదేష్, మహిళలు పాల్గొన్నారు.

గోసంరక్షణకు రూ.లక్ష విరాళం


దాతకు ప్రసాదం అందజేస్తున్న పర్యవేక్షకురాలు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ కోసం సోమవారం హైదరాబాదుకు చెందిన ఎన్.ఆర్. అనురాధదేవి రూ.1,00,516-లు విరాళంగా అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు హిమబిందు దాతకు రసీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందించారు. అర్చకుడు దాత అనురాధదేవిని ఆశీర్వదించారు.

గూడ్స్‌రైలు ఢీ.. కణతి మృతి

మహానంది, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలోని చలమ రైల్వే స్టేషన్ సమీపంలోని నల్లమల అడవిలో సోమవారం గూడ్సు రైలు ఢీ కొని కణతి మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న గూడ్సు రైలు కింద వన్య ప్రాణి కణతి మృతి చెందిందన్న సమాచారం మేరకు చలమ రేంజ్ అటవీ అధికారి మద్దిలేటి స్వామి సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిశీలించారు. అనంతరం పశువైద్యులు సంఘటనా స్థలంలోనే కణతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా బి.శేషన్న

- డీసీవోగా రామాంజనేయులు

నంద్యాల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పురపాలక కమిషనర్‌గా తెనాలిలో పనిచేస్తున్న బి.శేషన్నను నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కమిషనర్‌గా పనిచేస్తున్న నిరంజన్‌రెడ్డిని విజయవాడలోని ఏపీయూడబ్ల్యూఎస్ ఎస్ఎంఐకీ బదిలీ చేశారు. ఇదిలా ఉండగా.. కర్నూలు జిల్లా సహకార శాఖలో డీసీవోగా పనిచేస్తున్న ఎన్.రామాంజనేయులను నంద్యాల డీసీవోగా ప్రభుత్వం బదిలీ చేసింది.

తక్కువ ధరకే బంగారమంటూ మోసం!

- 24 గంటల్లో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

దేవనకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తమకు బంగారం దొరికిందని, తక్కువ ధరకే విక్రయిస్తామని నమ్మబలికి మోసం చేసిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ వంశీనాథ్ తెలిపిన మేరకు.. మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన కప్పల రంగస్వామి అనే వ్యక్తి వద్దకు ఆదివారం నెల్లూరు జిల్లాకు చెందిన మహిళతోపాటు ముగ్గురు వ్యక్తులు వచ్చి తమకు బంగారం దొరికందని తక్కువ ధరకే విక్రయిస్తామని నమ్మబలికారు. నకిలీ బంగారం గొలుసు చూపి, దాదాపు పది తులాలు ఉంటుందని, అడ్వాన్స్‌గా రూ.1.2లక్షలు అడ్వాన్స్ తీసుకొని మిగిలిన డబ్బును తాము మరలా వచ్చినప్పుడు ఇవ్వాలని ఒప్పందం చేసుకుని ఉడాయించారు. బాధితుడికి అనుమానం వచి పరీక్షలు చేయించగా నకిలీ బంగారంగా తేలింది. తాను మోసపోయానని గ్రహించిన రంగస్వామి దేవనకొండ పోలీసులను ఆశ్రయించాడు. సీఐ వంశీనాథ్ సిబ్బందితో గాలించి 24 గంటలలో నిందుతులను దేవనకొండ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. నిందుతులపై కేసు నమోదు చేసి, పత్తికొండ న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని అప్రమత్తంగా ఉండాలని ప్రజలను సీఐ హెచ్చరించారు.

జిల్లాలో రేంజర్ల బదిలీలు

- రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటరు ఉత్తర్వులు జారీ

రుద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో పనిచేస్తున్న ఫారెస్టు రేంజర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటరు అజయ్‌కుమార్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం ఫారెస్టు శాఖ అధికారులు తెలిపారు. రుద్రవరం రేంజర్ శ్రీపతినాయుడును అనంతపురం సోషల్ ఫారెస్టు డివిజన్‌కు, బనగానపల్లె రేంజర్ సుబ్బరాయుడును తిరుపతి డివిజన్‌కు, నంద్యాల రేంజర్ దినేష్‌కుమార్‌రెడ్డిని రీసెర్చ్ రేంజ్ ఆఫీసరుగా బయోడైవర్సిటీ శ్రీశైలంకు బదిలీ చేశారు. అలాగే శ్రీశైలం రేంజర్ సుభాష్‌ను మదనపల్లె అన్నమయ్య డివిజనుకు, ఆత్మకూరు రేంజర్ పట్టాభిని చిత్తూరు వెస్ట్ డివిజనుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రుద్రవరం రేంజ్‌లో సిబ్బంది..

రుద్రవరం రేంజ్‌లో సిబ్బందిని బదిలీ చేస్తూ నంద్యాల డిప్యూటీ డైరెక్టరు అనురాగ్ మీనా ఉత్తర్వులు జారీచేసినట్లు సోమవారం సాయంత్రం ఫారెస్టు అధికారులు తెలి పారు. డీవీపెంట సెక్షన్ పెద్దబంగలి బీట్ ఆఫీసరును రుద్రవరం సెక్షన్ మేడంబావి బీట్‌కు, బీట్ ఆఫీసరు సరస్వతిని ఆలమూరు సెక్షన్ నుంచి చెలిమరేంజ్ పెద్దకంబలూరు సెక్షన్‌లోని కోటకొండ బీట్‌కు, నంద్యాల రేంజ్ గడిగుండం బీట్‌లో పనిచేస్తున్న బలరామును భైరేని నార్త్ బీట్‌కు బదలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రుద్రవరం ఫారెస్టు కార్యాలయంలో పనిచేస్తున్న అటెండరు సుబ్బరాయుడును నంద్యాల ఆఫీసుకు, నంద్యాలలో పనిచేస్తున్న అటెండరు తిమోదిని రుద్రవరం ఫారెస్టు ఆఫీసుకు బదిలీ చేశారు.

జలవనరుల శాఖలో బదిలీలు


నగరంలోని జలమండలి కార్యాలయం

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ కర్నూలు జిల్లా సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్లలో పనిచేస్తున్న పరిపాలన విభాగపు సిబ్బందిని బదిలీలు చేస్తూ సోమవారం ఎస్ఈ బాలచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ పరిధిలోని మైనర్ ఇరిగేషన్, టీబీపీ ఎల్లెల్సీ సబ్‌డివిజన్, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు డివిజన్, కేసీ కెనాల్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న దాదాపు 70 మంది అటెండర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, ఏవోలను ఆయా సబ్ డివిజన్లకు బదిలీచేశారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత సర్కిల్ పరిధిలో 70 మంది వివిధ డివిజన్లు, సబ్ డివిజన్లలో పనిచేస్తున్న పరిపాలన సిబ్బందిని ఇంత పెద్దఎత్తున బదిలీచేయడం ఇదే ప్రథమం. బదిలీ అయిన ఉద్యోగులకు బాలచంద్రా రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

మార్కెటింగ్ శాఖ: కర్నూలు మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ కార్యదర్శిగా అనంతపురంలో పనిచేస్తున్న ఆర్.జయలక్ష్మిని నియమించారు. కర్నూలు సహకార శాఖలో డీసీఓగా వెంకటకృష్ణను నియమిరచారు ప్రస్తుతం ఈయన కాకినాడలో స్పెషల్ గ్రేడ్ డీఆర్‌గా ఉన్నారు.

ఎమ్మెల్యే అఖిలప్రియకు అస్వస్థత


అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

- హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు

దొర్నిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలోని మూలపెద్దమ్మ దేవరలో ఎమ్మెల్యే అఖిలప్రియ, భర్త భార్గవ్‌రామ్, సోదరుడు జగత్ విఖ్యాతరెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఉదయం నుంచి ఉపవాసదీక్షలు ఉండి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గండాదీపం మోశారు. ఉన్నఫలంగా స్పృహ కోల్పోవడంతో భర్త, సోదరుడు హుటాహుటిన ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యాధికారి సుజాత వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం నంద్యాల ఎన్ఐటీసీ ఆసుపత్రికి తరలివెళ్లారు. ఎమ్మెల్యే స్పృహ కోల్పోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రి వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

యోగాతో ఆరోగ్యం పదిలం

బండిఆత్మకూరు జూన్9 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ యోగా చేయటం వల్ల ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఎంపీడీవో దస్తగిరి, తహసీల్దార్ పద్మావతమ్మ, డాక్టర్ భావన సూచించారు. సోమవారం బండిఆత్మకూరులో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ర్యాలీ చేశారు. యోగా చేయడంతో కలిగే లాభాలను వారు వివరించారు. మండలంలోని పలు గ్రామాల్లో సైతం ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈ వెంకటరాముడు, ఏపీవో వసుధ, ఈవోపీఆర్డీ రామకృష్ణవేణి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పాములపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతి నిలయం గ్రామంలో సుంకులమ్మ నూతన దేవాలయం, విగ్రహప్రతిష్ఠ కార్యక్రమానికి భూమిపూజ నిర్వహించారు. సోమవారం గ్రామస్థులు పురోహితులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

మిడుతూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని 104 నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలోని మిడుతూరు-1, మిడుతూరు-2 సచివాలయాలను సోమవారం నోడల్ అధికారి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు బీపీ, షుగరు, క్యాన్సర్ సర్వేలను చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. ప్రజలు ఆయుష్మాన్ భారత్ ఎలక్ట్రానిక్ ఐడి కార్డు పొందేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య అధికారి రాజు, హెల్త్ సూపర్ వైజర్లు యోసేపు, రామతులశమ్మ, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి


డ్రోన్‌ను రైతులకు అందిస్తున్న అధికారులు

వెలుగోడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆదునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఏవో పవన్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ద్వారక రైతుమిత్ర గ్రూపు రైతులకు రాయితీపై కిసాన్ డ్రోన్‌ను అందచేశారు. కార్యక్రమంలో సంతజూటూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్‌కుమార్ వ్యవసాయ సిబ్బంది అంజిత్‌కుమార్‌రెడ్డి, రామలక్ష్మి, నాగమణి, రామక్రిష్ణ రైతులు పాల్గొన్నారు.

'రావూస్' విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): ఏపీఈఏపీ సెట్‌లో రావూస్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ ఏఎంవి అప్పారావు, డైరక్టర్ మోనిచంద్ర తెలిపారు. అగ్రికల్చర్ విభాగంగా నందకిశోర్ 688వ ర్యాంక్, మంజులత 1346 ర్యాంక్, వైష్ణవి 2276 ర్యాంక్, మహ్మద్‌సాహిద్ 3683 ర్యాంక్, అల్లూరయ్య 3990వ ర్యాంక్, లక్ష్మీశైలజ 4771 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో శ్రావ్య 1211వ ర్యాంక్, సభా 1346వ ర్యాక్, పూర్ణేష్ రావ్ 1553 ర్యాంక్, సాయిసహస్ర 2643 ర్యాంక్ సాధించినట్లు వివరించారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభం


గౌరవ వందనం స్వీకరిస్తున్న కల్నల్ జోబి ఫిలిఫ్

నంద్యాల హాస్పిటల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 4వ ఎన్‌సీసీ కంబైన్డ్ ఆన్యువల్ శిక్షణ శిబిరం సోమవారం రామకృష్ణ అటానమస్ డిగ్రీ, పీజీ కళాశాలలో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ 9వ ఆంధ్రా బాలికల బెటాలియన్ కల్నల్ జోబి ఫిలిఫ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పది రోజులపాటు నిర్వహించే ఈ శిబిరంలో దాదాపు 590మంది కేడెట్లు పాల్గొంటారన్నారు. శిబిరంలో డ్రిల్, వెపన్ ట్రైనింగ్, టీఎస్‌సీ సెలక్షన్స్, గెస్ట్ లెక్చరర్స్, హెల్త్ అండ్ హైజనిక్, మ్యాప్‌రీడింగ్, లీడర్‌షిప్ క్వాలిటీస్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఇన్‌స్ట్రక్టర్స్‌గా 30మంది పీఐ స్టాఫ్, 15మంది ఎన్‌సీసీ ఆఫీసర్లు వ్యవహరిస్తారని, శిబిరాన్ని సక్రమంగా వినియోగించుకొని ఏబీసీ పరీక్షకు సిద్ధమై క్రమశిక్షణతో దేశభక్తిభావజాలం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియ, ఎన్‌సీసీ అధికారులు హరిత, మౌలాబి, హేమదుర్గ, పద్మావతి, అశ్వని, నాగరత్నమ్మ, శారద, లావణ్య, సునీత, శిరీష, నాగమణిబాయి, లక్ష్మీదుర్గ, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు పెరిగిన ఆదాయం

నంద్యాల కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూములు కౌలుకు, రూములు అద్దెకు సోమవారం వేలం పాటలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపి, ధర్మకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ భూములు 09.79ఎకరాలకు సంబంధించి ప్రస్తుతం గుత్త రూ.248000 వచ్చింది. గతం కంటే రూ.9 7500 అధికంగా వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురళీక్రిష్ణ, సురేష్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు విజన్ యాక్షన్ ప్లాన్

● కలెక్టరేట్‌లో యూనిట్ కార్యాలయంలో ప్రారంభించిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్


జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ గురించి మంత్రి ఫరూక్‌కు వివరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం విజయవాడ నుంచి స్వర్ణాంధ్ర-2047విజన్ డాక్యుమెంట్ యాక్షన్ ప్లాన్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వీడియో కాన్ఫరెన్స్‌లో వర్చువల్ విధానంతో అన్ని జిల్లాలు, నియోజకవర్గాలలో ప్రారంభించారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లోని జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి ఫరూక్ ప్రారంభించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పేదరికం లేని సమాజం, ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధనవనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు-బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్ 10 ప్రధాన సూత్రాలతో స్వర్ణాంధ్ర - 2047విజన్ డాక్యుమెంట్ యాక్షన్‌ప్లాన్‌ను రూపొందిస్తామని కలెక్టర్ రాజకుమారి మంత్రి ఫరూక్‌కు వివరించారు. దీనికి ప్రతినియోజకవర్గంలో, జిల్లా కేంద్రంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కార్యాలయంలో అయిదుగురు సచివాలయ సిబ్బంది చొప్పున ఏడు నియోజకవర్గాల్లో 35మంది, జిల్లా కేంద్రంలో అయిదుగురు చొప్పున పని చేయడానికి 40మంది సచివాలయ సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. అలాగే జిల్లా, నియోజకవర్గాలలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. యూనిట్ ద్వారా దాదాపు 293రకాల సేవలు వినియోగంలోకి వస్తాయని మంత్రికి కలెక్టర్ వివరించారు. ప్రారంభ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, సీపీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ, ఉద్యాన శాఖలపై ప్రత్యేక దృష్టి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


నియోజకవర్గ దార్శనిక ప్రణాళిక కార్యక్రమంలో సీఎం టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న గౌరు చరిత

పాణ్యం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వ్యవసాయ, ఉద్యాన శాఖలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. సోమవారంఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ దార్శనిక ప్రణాళిక విభాగం కార్యక్రమంలో భాగంగా ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఓర్వకల్లు, పాణ్యం మండలాలలో ఎక్కువగా ఉద్యాన వన పంటలు సాగులో ఉన్నాయన్నారు. అలాగే గడివేముల మండలంలో పరిశ్రమలు, నీటిప్రాజెక్టులు, కల్లూరు మండలంలో ప్రభుత్వ సేవా విభాగాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కాల్వబుగ్గ, సుబ్బరాయుని కొత్తూరు, భోగేశ్వరం, పాణికేశ్వరం వంటి ఆధ్యాత్మిక ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాలలో టూరిజం అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

● అమరావతి మహిళల మనసును జగన్ రోత టీవీలో గాయం చేసేలా డిబేట్ పెట్టి మాట్లాడడం హేయమైనదన్నారు. రాష్ట్ర రాజధాని కోసం వేలాది మంది మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి విజయం సాధించారన్నారు. అటువంటి పట్టుదల కలిగిన మహిళలను వేశ్యలుగా పేర్కొనడం మహిళాలోకాన్నే కించపరచడమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో రామసుబ్బారెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌వో మహబూబ్‌బాష, యూనిట్ సభ్యులు డాక్టర్ పీవీ గోపికృష్ణారావు, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పొగాకు రైతులు

నంద్యాల నూనెపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా రైతులవద్దనున్న అన్ని రకాల పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పొగాకు రైతులకు, కంపెనీలకు మధ్య కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి చేపట్టిన చర్చలు సఫలమయ్యాయని అనుకున్నామే తప్ప ప్రైవేట్ పొగాకు కంపెనీలు పూర్తిస్థాయిలో పొగాకును కొనుగోలు చేయకుండా క్వింటా రూ.5వేలకే కొనుగోలు చేయడం సరైందికాదని అన్నారు. అనంతరం జేసీ విష్ణుచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బొజ్జన్న, సుబ్బనర్సయ్య, పెద్దపుల్లయ్య, సుబ్బరాయుడు, పొగాకు రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెంచుల అభివృద్ధికి కృషి చేయాలి

మహానంది మండలం అబ్బీపురం గ్రామ చెంచులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చెంచు కుటుంబాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అబ్బీపురం గ్రామంలో 42చెంచుకుటుంబాలు పూరి గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, అకాల వర్షాలతో ఇళ్లల్లోకి నీరు చేరడం, విషజంతువులతో ఇబ్బందులకు గురికావడం, గర్భిణులు, చిన్న పిల్లలు అవస్థలుపడుతున్నారని వారిని ఐటీడీఏలో చేర్చి చెంచుల అభివృద్ధికి తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. జేసీ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లక్ష్మయ్య, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల పూర్వ డిప్యూటీ జనరల్ సెక్రటరి మురళి, సామేల్ పాల్గొన్నారు.

జలచౌర్యాన్ని అరికట్టాలి

మిడ్తూరు మండలంలోని మద్దిగుండం చెరువునుంచి జలచౌర్యాన్ని అరికట్టాలని మండలంలోని జలకనూరు గ్రామ రైతులు డిమాండ్ చేశారు. మోటార్ కనెక్షన్లతో చెరువులోని నీటిని అక్రమంగా తరలిస్తూ గ్రామంలోని ఆయకట్టు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ జలకనూరు రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి జేసీకి వినతి పత్రం అందజేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



నంద్యాలలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల రూరల్ జూన్ 9(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు అయినప్పటికీ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై రోజుకు ఒక మాట మాట్లాడడం సరైనది కాదని హెచ్చరించారు. ఐదు వేల మంది కార్మికులను అన్యాయంగా, అక్రమంగా తొలగించాలని చూస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక మాట మాట్లాడుతున్న కేంద్రం, ఇప్పటికైనా నాటకాలు ఆపాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుల పాల్గొన్నారు.

ఆత్మకూరు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలనిఇ సీఐటీయు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రానికి మణిహారంలా ఉన్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే ప్రయత్నాలను విరమించుకోవాలని అన్నారు. 5వేల మంది కార్మికులకు పనులు లేవని తొలగించడం దుర్మార్గమన్నారు.

వెలుగోడు: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ నాయకులు నాగమోహన్, మహమ్మద్‌రఫీ, రామంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రధాన కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ విశాఖ ప్లాంట్‌లో తీసివేసిన 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, కిశోర్, క్రిష్ణ, ఎర్రబాషా, రహంతుల్లా, క్రిష్ణ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పనులకు శ్రీకారం


భూమి పూజలో పాల్గొన్న మంత్రి ఆనం నారాయణరెడ్డి, ఎమ్మెల్యే

మహానంది, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం తమ్మడపల్లిలోని అతి పురాతన కాశీవిశ్వేశురుడి ఆలయ పునః నిర్మాణ పనులకు దేవదాయశాఖ రూ.కోటి నిధులను మంజూరు చేసింది. నిర్మాణ పనులకు సోమవారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, న్యాయశాఖ మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్యామల జనార్ధన్‌రెడ్డి, యువనాయకుడు ముత్యాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి: కలెక్టర్

బండిఆత్మకూరు జూన్9 (ఆంధ్రజ్యోతి): విద్యలో గ్రామీణ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రాజకుమారి ఆకాంక్షించారు. సోమవారం విద్యాశాఖ ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ అవార్డులకు ఎంపిక చేసింది. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతం బండిఆత్మకూరు అబీద్, మదార్‌బీల కూతురు రేష్మాకు కలెక్టర్ అవార్డు, రూ.20వేల చెక్కును అందించారు.


పాములపాడు: విద్యార్థులతో ప్రిన్సిపాల్


కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న జూపాడుబంగ్లా విద్యార్థులు

పాములపాడు: ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అత్యుత్తమ ప్రతి భ కనబరచి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన షైనింగ్‌స్టార్స్ ధ్రువీకరణ పత్రం, రూ.20వేల చెక్కును పాములపాడు మోడల్‌స్కూల్‌లో చదివిన నలుగురు విద్యార్థులకు దక్కింది. ప్రిన్సిపాల్ నాగరవీంద్ర మాట్లాడుతూ మల్లన్న, యశశ్వినీ, హైమావతీ, భవానీలకు చెక్కులను అందించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు షైనింగ్‌స్టార్ అవార్డులు ప్రభుత్వం అందించినట్లు ఎంఈవో చిన్నమద్దిలేటి తెలిపారు. ఒక్కొక్కరికీ రూ. 20వేల చొప్పున నగదుతోపాటు, ప్రశంసాపత్రాలను జిల్లాకలెక్టర్ రాజకుమారి సోమవారం అందించారని చెప్పారు. అంబేడ్కర్ గురుకులంలో జగదీష్, రవితేజ, ఆదర్శపాఠశాలకు చెందిన హారిక, హేమచంద్రారెడ్డి, మండ్లెం జిల్లాపరిషత్తు ఉన్నతపాఠశాలకు చెందిన కల్పన, జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన సయ్యద్‌సుమయ్యా అనే విద్యార్థులు అవార్డులు అందుకున్నట్లు చెప్పారు.


కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గ్రామీణ విద్యార్థి రేష్మా

వెలుగోడు: పది, ఇంటర్‌లో అత్యదిక మార్కులు సాదించిన విద్యార్థులకు ప్రభుత్వం షైనింగ్‌స్టార్స్ పేరుతో విద్యార్థులకు నగదు ధృవపత్రాలతో సన్మానించారు. వెలుగోడు పట్టణంలోని లిటిల్ ఏంజిల్ పాఠశాలకు చెందిన శరణ్యను కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

యోగాంధ్ర నిర్వహణ తీరుపై టీడీపీ మండిపాటు

నంద్యాల రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణలో అధికారుల తీరుపై టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. సోమవారం నంద్యాల మండల రాయమాల్పురం గ్రామ టీడీపీ నాయకుడు కాశన్న మాట్లాడుతూ ప్రభుత్వం మే 28 నుంచి జూన్ 21 వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా యోగాభ్యసన సాధన కార్యక్రమం నిర్వహిస్తుందని, అయితే అధికారులు వైసీపీ నాయకులను మాత్రమే ఆహ్వానిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకుల మనోభావాలు దెబ్బతీసేలా అధికారులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు అంజుమన్ సంస్థ అధ్యక్షుడు ఎన్ఎండీ ఖుద్దూస్ పేర్కొన్నారు. నంద్యాల అంజుమన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సం లాగే ఈ ఏడాది ఏడాది కూడా 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ప్రతి ఒక్కరికీ రూ.3వేలు ఉపకారవేతనం అందజేస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంజుమన్ సంస్థలో ఉచితంగా లభించే దరఖాస్తు ఫారంలో పూర్తి వివరాలు నింపి 10వ తరగతి మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్, కళాశాలలో చేరిన ధృవీకరణ పత్రం, రెండు ఫొటోలు జతచేసి జూన్ 30వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

ఆత్మకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహానాయక్, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఉమర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 9 వారాల వేతనాలు చెల్లించడంతోపాటు జాబ్‌కార్డులు అర్హులైన వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు స్వాములు, తిక్కస్వామి, శివశంకర్, భూషన్న తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీని అరికట్టాలి

ఆత్మకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దినేష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సుదర్శనవర్మ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరులోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, టీషర్టులు తదితర వాటి పేర్లతో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధలనకు వ్యతిరేకంగా పాఠశాలలు నడుపుతున్నా ఎవరూ పట్టించుకోలేదని మండిపడ్డారు. జిల్లా, మండల విద్యాశాఖాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయి, ప్రశాంత్ ఉన్నారు.

నరేంద్రమోదీ కృషి అభినందనీయం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమని నంద్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. అభిరుచి మధు ఆధ్వర్యంలో నరేంద్రమోదీ పాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నంద్యాల బీజేపీ కార్యాలయంలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గురబ్రహ్మం,రమేష్‌బాబు, చంద్రశేఖర్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మేడా మురళీధర్, నిమ్మకాయల సుధాకర్, మహిళా నాయకురాలు అరుణ, కార్యకర్తలు బాలముని పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు మోమిన్ షబానా

ఆత్మకూరు: ప్రధాని మంత్రి మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జాతీయ మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా పేర్కొన్నారు. సోమవారం మోదీ ప్రభుత్వం 11ఏళ్లను పురస్కరించుకుని స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానీ మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.అనంతరం పార్టీ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, బాలిరెడ్డి, మల్లారెడ్డి, అన్వర్, ఖాదర్‌అలి, సుదర్శన్ సింగ్, ఫారూక్ తదితరులు ఉన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్

నంద్యాల టౌన్, జూన్9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో బాల ఆధార్, 0 నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు ఆధార్ కార్డు తీసుకునే వారికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ వెంకటదాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 15 ఏళ్లలోపు ఆధార్ లేనివారు 69740 మంది, 15 ఏళ్లు నిండిన వారు 90903 మంది ఉన్నారని ఆదేవి ధంగా జిల్లా వ్యాప్తంగా ఆధార్ స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీ నుంచి 13 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం ఏర్పాటై 26ఏళ్లను పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో మహాగణపతి హోమం, కలశస్థాపన, అష్టోత్తరాలు, కలశాభిషేకాలు, సహస్ర నామార్చన, ఆవాహిత దేవతా హోమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి విశేష అలంకరణతో పాటు భజనలు, ప్రాకారోత్సవాలు, రాత్రి పడిపూజ, పల్లకిసేవ, మహామంగళహారతి, వేదస్వస్తి తదితర పూజాక్రతువులను చేపట్టారు.

అరటి రైతుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

మహానంది, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం వీచిన ఈదురుగాలులకు నేలకూలిన అరటి చెట్ల నష్ట పరిహారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కెసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరి రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం నేలకూలిన అరటిచెట్లను ఆయన ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, టీడీపీ మండల కార్యదర్శి కంచెర్ల శివశంకర్, నాయకులు గడ్డం నాగపుల్లయ్య, మారెడ్డి సుబ్రమాణ్యం, జయరాం, సుంకులయ్య పాల్గొన్నారు.

స్వప్న వాసవదత్త పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సాహిత్య ప్రియులు

నంద్యాల కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ రచయిత్రి కొండూరి శ్రీదేవి రచించిన 60వ పుస్తకం "స్వప్నవాసవదత్త" పుస్తకావిష్కరణ సోమవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాలలో రచయిత్రి డా. శ్రీదేవి నివాసంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం సూరనసారస్వత సంఘం, మాతృబాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గెలివి సహదేవుడు, రచయతలు కళామురళి, డా. కిషోర్ కుమార్, అన్నెం శ్రీనివాసరెడ్డి, డా. నీలం వెంకటేశ్వర్లు, కవులు మాబుబాషా, నీలకంఠమాచారి,రఫీ, రవికుమార్, నరసింహులు, కృష్ణప్రియ, లలితాసరస్వతి తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అహోబిళంలో తిరునక్షత్ర వేడుకలు


ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రధాన అర్చకులు

ఆళ్లగడ్డ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలంలో నమ్మాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా సోమవారం వేద పండితులు విశేష పూజలు చేశారు. ఆలయ ఆవరణలో పీఠంపై నమ్మాళ్వార్ విగ్రహాన్ని, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరద స్వామి వార్లను అలంకరించి ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాల్‌స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహావిష్ణువు పన్నెండు మంది భక్తులలో నమ్మాళ్వార్ ఒకరని ప్రధాన అర్చకులు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


స్వామివార్లను దర్శించుకున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యనకండ్ల గ్రామం మైహోం ఇండస్ట్రీస్ వారి జయజ్యోతి సిమెంట్ లిమిటెడ్ ప్రాంగణంలో సోమవారం సీతారామచంద్ర ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పాల్గొని అమ్మవారిని, స్వామివారి విగ్రహాలకు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మైహోం ఇండస్ట్రీస్ యజమాని జూపల్లె రామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి బనగానపల్లెకు పేరు తీసుకురావాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. సోమవారం పట్టణంలోని ఎస్వీ చైతన్య ఇంగ్లిషు డిజిటల్ హైస్కూల్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమలో రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి


మాట్లాడుతున్న డీఈ శ్రీనివాసరెడ్డి

రుద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటి పైకప్పు సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ప్రధానమంత్రి సూర్యఘర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ ప్రతి ఇంటి యజమాని సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, డిప్యూటీ డీఈ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి ఏఈ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతులు

కొలిమిగుండ్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది కాలంగా నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కష్టాల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సహాయం అందించి ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం మండల కన్వీనర్ పుల్లయ్య ఆధ్వర్యంలో పలువురు రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గుజ్జల పెద్దయ్య, చిన్నపెద్దయ్య, పోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

సుజాతను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఉయ్యాలవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి సుజాత అవయవదానం చేసి స్ఫూర్తిగా నిలిచారని ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఎనిమిదో రోజుకు చేరిన దీక్ష

బేతంచెర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని యాజమాన్యం పునరుద్ధరించాలని కార్మికులు కోరారు. ఫ్యాక్టరీ గేటు ముందు చేస్తున్న దీక్షలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికులకు సిమెంటు ఫ్యాక్టరీ జీవనాధారమని, ఎలాంటి జీవనోపాధి లేదన్నారు. యాజమాన్యం మొండి వైఖరీ వీడనాడి సిమెంటు ఫ్యాక్టరీని నడిపించాలని కోరారు. రాజకీయాలు ముడిపెట్టడం సరికాదన్నారు. 13 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోజెస్, కార్మికులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన వెంకటరమణ(45) అనే వ్యక్తి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. గ్రామ సమీపంలో పడిపోవడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు గత కొంతకాలం నుంచి మద్యానికి బానిసై ఉన్నాడన్నారు. అతని భార్య ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి

డోన్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని ప్రైవేటు స్కూళ్ల బస్సులపై చర్యలు తీసుకోవాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తకోట విజయభాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం డోన్ ఆర్‌టీవో క్రాంతి కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు వెంకటేశ్, జయరాం, రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఏడాదైనా అందని బీమా సొమ్ము

● ఎల్ఐసీ కార్యాలయం వద్ద మృతుడి బంధువుల ఆందోళన


ఎల్ఐసీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సర్పంచ్, బాధిత కుటుంబ సభ్యులు

డోన్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి ఏడాదైనా బీమా సొమ్ము అందలేదని మృతుడి బంధువులు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీసు వద్ద సర్పంచ్ కమలాపురం రేగటి అర్జున్ రెడ్డితో పాటు మృతుడి కుటుంబ సభ్యులు ఎల్ఐసీ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ముందుగా ఎల్ఐసీ మేనేజర్‌ను కలిసి నారాయణ మృతిచెంది ఏడాది పైగా అయినప్పటికీ ఎందుకు బీమా పరిహారం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మేనేజర్ స్పందిస్తూ ఎల్ఐసీ హెడ్ ఆఫీసును సంప్రదించాలని తెలియజేయగా.. మృతి చెందిన ఏడాది పూర్తయినప్పటికీ ఇప్పుడు నోటీసులు ఇచ్చి హెడ్ ఆఫీసును సంప్రదించాలని ఎలా చెబుతారని బాధిత కుటుంబ సభ్యులు నిలదీశారు. ఈ ఆందోళనలో నాగమద్దిలేటి సురేష్, నరసింహా, వలి పాల్గొన్నారు.


రుద్రవరంలో అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రం


పెద్దకంబలూరులో రైతు భరోసాకేంద్రం నిర్మాణ పునాదుల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

పునాదులకే పరిమితం

- ముందుకు సాగని వెల్‌నెస్, రైతుభరోసా కేంద్రాల నిర్మాణ పనులు
- తుప్పుపట్టిన ఇనుప కడ్డీలు
- పలుచోట్ల పెరిగిన పిచ్చి మొక్కలు
- బిల్లులు అందక ఆపేసిన కాంట్రాక్టర్లు

రుద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెల్‌నెస్, రైతు భరోసా కేంద్రాల పనులు పలుచోట్ల పునాదులకే పరిమితమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. అయితే ఆర్భాటం తప్ప రైతులకు సేవలందించేందుకు నిర్మిస్తున్న పనులను నిర్లక్ష్యంగా వదిలేశారు. రుద్రవరంలో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రం, శ్రీరంగాపురంలో వెల్‌నెస్ కేంద్రం, రైతు భరోసా కేంద్రం, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, మందలూరులో రైతు భరోసా కేంద్రాల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. పేరూరులో రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రం, నాగులవరం రైతు భరోసా కేంద్రం పనులు నిలిచిపోయాయి. బిల్లులు రాకపోవడంతో


శ్రీరంగాపురంలో పునాదులకే పరిమితమైన వెల్‌నెస్ కేంద్రం


శ్రీరంగాపురంలో పునాదులకే పరిమితమైన రైతు భరోసా కేంద్రం

కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. కొన్ని గ్రామాల్లో పునాదులకు నిర్మించిన ఇనుప కడ్డీలు తుప్పుబట్టాయి. మరికొన్ని గ్రామాల్లో పునాదుల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈవిషయంపై పంచాయతీరాజ్ ఈఈ కమాల్‌సాబ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నిలిచిన రైతు భరోసాకేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలపై నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాం. ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రారంభించి పనులు పూర్తి చేస్తాం.

రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలి

● బేతంచెర్ల స్టేషన్ ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

బేతంచెర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దయిన రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అన్నారు. సోమవారం వైసీపీ నాయకులు పిట్టల జాకీర్ హుశేన్, గోరుమానుకొండ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, సీపీఐ మండల కార్యదర్శులు తిరుమలేష్, దస్తగిరి, పట్టణ కార్యదర్శి నాగరాజు, నాయకులు, కార్యకర్తలతో కలిసి రైల్వేస్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు దూర ప్రయాణాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి రద్దయిన రైళ్ల సర్వీసులను తిరిగి ప్రారంభించాలన్నారు. అలాగే స్టేషన్‌లో తాగునీరు ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు, షెడ్లు నిర్మాణం, కనీసమౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎల్లకృష్ణ, ప్రదీప్, భాస్కర్, కోట్ల మధు, ఆనపాల తిరుమలేష్, ఆల్తాఫ్, లయన్స్ క్లబ్ వలి, నగేష్, పాలిష్ కట్టర్, ఎస్‌టీ హరూన్ బాషా, ఆటో రవి, అబి పాల్గొన్నారు.


బేతంచెర్ల రైల్వేస్టేషన్ ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు


డోన్‌స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్: కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి మోట రాముడు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం 30 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ రైల్వేస్టేషన్ మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, బి.నారాయణ, రామ్మోహన్, పుల్లయ్య, హుశేన్ పీరా, ఎం.రామ్మోహన్, లక్ష్మీదేవి, అమృత రెడ్డి, అన్వర్, బాలమద్దయ్య, చంద్రశేఖర్, కొండయ్య, పాపారాయుడు, రంగస్వామి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ దేవర

● అమ్మవారిని దర్శించుకున్న మంచు మనోజ్ దంపతులు

దొర్నిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంతో విశిష్టత ఉన్న డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన గ్రామదేవత మూలపెద్దమ్మ దేవర సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. 11 సంవత్సరాల తరువాత దేవర జరగడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గ్రామంలో ప్రతి ఇళ్లు బంధువులతో కళకళలాడింది. మహిళలు అధిక సంఖ్యలో బోనాలు నెత్తిన పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. అర్ధ రాత్రి తరువాత దేవర పోతురాజుతో గ్రామంలో ఊరేగింపు చేశారు. గ్రామస్థులు పెద్దమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఏరువ ప్రసాద్‌రెడ్డి, నంద్యాల పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షుడు సిద్ధి సత్యనారాయణ, మహేశ్వర్‌రెడ్డి, గంగవరం కృష్ణారెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు


పెద్దమ్మ అమ్మవారు


పెద్దమ్మను దర్శించుకున్న మంచు మనోజ్ దంపతులు

అమ్మవారి సన్నిధిలో మంచు మనోజ్ దంపతులు

సినీ నటుడు మంచుమనోజ్, ఆయన భార్య భూమా మౌనిక అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి మండల మాజీ అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా సంతోష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి ఆహ్వానించారు.

మంత్రిపై ఆరోపణలు తగదు

● ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్

బనగానపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపణలు చేయడం తగదని ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను మంత్రి బీసీకి కమీషన్లు ఇచ్చినట్లు ఈనెల 4న జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే ఆరోపించడం సమంజసం కాదన్నారు. తాను నిర్మించిన జీఎస్ఎస్ పంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ స్థలం కొంత ఉండడంతో పంచాయతీ వారు నోటీసులు జారీచేశారన్నారు. ఈ విషయంపై మంత్రిని కలిసి ఇబ్బందులు లేకుండా చూడాలని సాయం కోరానన్నారు. బనగానపల్లె అభివృద్ధి కోసం తాను విరాళం ఇచ్చానని, మంత్రికి ఎలాంటి కమీషన్లు ఇవ్వలేదని వేణుగోపాల్ స్పష్టం చేశారు.

13న బెలుం గుహల వద్ద యోగాంధ్ర

కొలిమిగుండ్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న బెలుం గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ రాజకుమారి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు

ప్యాపిలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందించారు. కళాశాల నుంచి 23 మంది విద్యార్థులు ఎంసెట్ రాయగా అందులో 13 మంది క్వాలిపై కావడం హర్షనీయమన్నారు. అందులో రవికిరణ్ , సస్మిత, నరసింహ, ప్రసాద్ మంచి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

క్రీడాభివృద్ధికి చేయూత

ఆళ్లగడ్డ జూన్ 9(ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి తమ వంతుగా చేయూతనిస్తామని ఆళ్లగడ్డ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక లైబ్రరీలో ఇన్‌చార్జి అరుణకుమారి అధ్వర్యంలో 30 జతల క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. కోచ్‌లు సుబ్బరాయుడు, శేషు, క్రీడాకారులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

డోన్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని యోగా గురూజీ రాంపుల్లయ్య అన్నారు. యోగాంధ్ర వారోత్సవాల్లో భాగంగా సోమవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కీళ్లవాతం, డి-విటమిన్ ఉత్పత్తి, చర్మవ్యాధులు తొలగిపోవడం, బరువు తగ్గడం, మలబద్ధకం వంటి సమస్యలు యోగాతో దరిచేరవన్నారు. ప్రతి రోజూ యోగా చేయాలని సూచించారు. శారీరక శ్రమతో మంచి ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్, సిబ్బంది, యోగా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



బేతంచెర్లలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

డోన్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.శివరాం, పట్టణ మండల అధ్యక్షుడు నక్కిశ్రీకాంత్, రామాంజనేయులు, ప్యాపిలి మండల కార్యదర్శి ఎన్ఏ చిన్న రెహిమాన్ డిమాండ్ చేశారు. సోమవారం బేతంచెర్ల సర్కిల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పాతబస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, వేణుగోపాల్, ఎస్.ఖాజా,వెంకటరమణ, మాలిక్‌బాషా పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందజేత


ఎంఈవోకు నియామక పత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎంలు

చాగలమర్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలల హెచ్‌ఎంలు నియామక పత్రాలను సోమవారం ఎంఈవో అనూరాధకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది కొత్తగా 12 మోడల్ పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. పది మోడల్ పాఠశాలలకు ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో హెచ్‌ఎంలను నియమిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మోడల్ పాఠశాలలో విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


తండాలో ర్యాలీ చేస్తున్న అధికారులు, ఏఎన్‌ఎంలు

చాగలమర్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఓజీ తండా గ్రామంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ మారడంతో దోమలు విజృంభిస్తాయని, వాటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వకుండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి దోమల నివారణకు ద్రావణం పిచికారి చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కృష్ణమ్మ, హెచ్‌ఈ రాముడు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూములకు వేలం

చాగలమర్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల చెరువు గ్రామంలో భైరవీశ్వర, శివాలయానికి చెందిన 29 ఎకరాల భూములకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో సాయి చంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ భూములను కౌలుకు తీసుకునే రైతులు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేస్తామని పేర్కొన్నారు.

కేసీ కాలువ మరమ్మతులకు ప్రతిపాదనలు

చాగలమర్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీ కాలువ మరమ్మతుల కోసం రూ.10 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు డీఈ పుల్లయ్య తెలిపారు. సోమవారం దెబ్బతిన్న పంట కాలువలు, లైనింగ్‌లను పరిశీలించారు. మరమ్మతులు చేయుటకు నిధుల కోసం అంచన వేశామని అన్నారు. రాజోలి ఆనకట్ట వద్ద గేట్లను పరిశీలించారు. నిధులు మంజూరైతే కాలువ పనులు చేపడతామని అన్నారు. కేసీ కాలువ సైడ్‌వాళ్లు, డిస్ట్రిబ్యూటర్లు మరమ్మతులు చేస్తామన్నారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూస్తామని అన్నారు. ఆయన వెంట ఏఈ జమాల్‌వలి, సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

బనగానపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, కేవీకే శాస్త్రవేత్త లక్ష్మిప్రియ అన్నారు. సోమవారం మండలంలోని పసుపుల గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంట అవశేషాలు సుస్థిర యాజమాన్య పద్ధతులపై భూసారపరీక్షలు, ప్రయోజనాలు, వేసవి దుక్కులు, ప్రయోజనాలపై వివరించారు. సస్యరక్షణ చర్యలు, ఉద్యానవన పంటల సాగులో మెళకువలు, పశుపోషణ, యాజమాన్య పద్ధతులు చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది చామంతి, కల్పన, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన టంగుటూరు పెద్దమ్మ ఆలయాభివృద్ధికి దాతలు విరాళం అందించారు. గోస్పాడు మండలం తేళ్లపూరి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, కుమారులు సోమవారం పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. అనంతరం నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రూ. 50వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా రామగంగిరెడ్డి దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

యాగంటిలో ఘనంగా పల్లకీసేవ


స్వామివారి పల్లకీ సేవ

బనగాన పల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రధాని మోదీతో దేశాభివృద్ధి

డోన్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకట రమణ అన్నారు. భారత ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు పాతబస్టాండు సమైక్యాంధ్ర కట్ట వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ నాయకులు కిరణ్, ఉషాలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి విశేష పూజలు

కొలిమిగుండ్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేట్నీకోటలో వెలసిన ప్రసిద్ధి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గిరిస్వామి, భక్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులతో డీలర్ ఘర్షణ

డోన్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో గోసానిపల్లె గ్రామానికి చెందిన డీలర్ మల్లయ్య సోమవారం ఘర్షణకు దిగాడు. రెండు సంవత్సరాల నుంచి రేషన్ తక్కువగా వస్తుందని చెప్పిన పట్టించుకోవడం లేదని డీటీ సునీల్ రాజ, ఆపరేటర్ దీపక్‌తో ఘర్షణపడ్డాడు. అక్కడే ఉన్న ఆర్ఐ మస్తాన్, వీఆర్వో మల్లారెడ్డి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా అధికారులపై విరుచుకుపడ్డాడు.